# బ్రహ్మాండ పురాణాంతర్గత

# శ్రీ కేతకీ సంగమేశ్వరక్షేత్ర మహాత్యము



# శ్రీకేతకీ సంగమేశ్వర మహాత్మ్యము

సృష్టి

అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడగు సర్వేశ్వరుడు గోచరములను, అగోచరములునైన చతుర్దశ భువనములను తన సంకల్పమాత్రముచే సృష్టించి, రక్షించి, లయింప జేయుచున్నాడు. ఇందు భూలోకము మాత్రము మానవ దృష్టిగోచమైయున్నది. స్వర్గ పాతాళములను గూర్చి వినియున్నాము. తక్కిన లోకములు గ్రంథ పఠనా పరిజ్ఞానము గల వారికి మాత్రమే విధితములైయున్నవి. భూమండలము సముద్రజలములచే విభజింపబడి, ద్వీపములుగా మారి ఖండాంతరములై వివిధ నామముల చేవిల సిల్లుచున్నది.

**జంబూద్వీపము, భారత వర్షము, ఆర్యావర్తము**

సముద్రము చేత విభజింపబడిన ద్వీములలో జంబూద్వీపము (నేటి ఆసియా ఖండము) వొకటి. అట్టి జంబూద్వీపమునందలి దక్షిణ భాగమున సముద్రమునకు ఉత్తరముగాను హిమాలయమునకు దక్షిణముగానుండు భూభాగమునే మన పూర్వులు భారతవర్షమని నామకరణము చేసియున్నారు. సత్పురుషులకు నివాసమగుటచే మన దేశమునకు ఆర్యావర్తమనియు విశేషనామము కలదు. పుణ్యభూమి, కర్మభూమి, తపోభూమి అని ప్రపంచమునందు ప్రఖ్యాతిగాంచినది.

భారత వర్షమునకు ప్రపంచ దేశములో యెక్కడ లేని ప్రత్యేకతలు గలవు. పవిత్ర జలములతో నిరంతరము ప్రవహించెడి జీవనదులు మానసరోవ రాది పుణ్య నదములు, సర్వేశ్వరుడు స్వయం వ్యక్తమై విరాజల్లుచున్న పుణ్య క్షేత్రములు (శైవ, వైష్ణవ, శాక్తేయ పీఠములు ఇతరములు) అసంఖ్యాకములైయున్నవి. యజ్ఞ, యాగ, తపోధ్యానానుష్ఠానములచే ఘటానా ఘటన సామర్థ్యములను సాధించిన మంత్రద్రుష్టలైన మహర్షుల తపోభూములైననైమిశ్వాద్యరణ్యములమలు, మహేంద్ర, సహ్యా హిమాచలాది పర్వత గుహలు మహర్షులతపో మహిమలచే ప్రభాభాసితములై యున్నవి.

ఉత్తర భారతము పుణ్యతీర్థములకు నెలవై యుండగా దక్షిణ భారతము పుణ్యక్షేత్రములకు ఆయా క్షేత్రములలో కొలువు దీరి భక్తుల నాకర్షించు దేవతా మూర్తులకు నెలవై విరాజిల్లుచున్నది.

శ్రీరంగము, తిరుపతి, సింహాచలము వంటి వైష్ణవ పుణ్యక్షేత్రములతో పాటు శ్రీశైలము, శ్రీకాళహస్తి, ద్రాక్షరామము వంటి శైవ క్షేత్రములను దక్షిణాదిన సుప్రసిద్ధములైదీన్నవి.

ఆయా క్షేత్రములలో వెలసిన దేవతామూర్తులు కొన్ని స్వయం వ్యక్తములు కాగా మరికొన్ని ఋషులచే ప్రతిష్టింపబడి వారితపః ఫల ప్రభావముచే విరాజిల్లుచున్నవి. స్వయం వ్యక్తమైన దేవతామూర్తుల క్షేత్రములు ఆచంద్రతారార్కము అత్యంత వైభముతో ఆర్తులకు కొంగు బంగారమై విరజిల్లు ననియు, ఋషి ప్రోక్తమైన క్షేత్రములు కొన్ని యుగముల వరకు మహిమాన్వితములై ప్రసిద్ధిగాంచునియు ఆర్యోక్తి. స్వయం వ్యక్త, ఋషి ప్రోక్త క్షేత్రవైభవములను గురించిన వివరములు ప్రసంగవశాత్తు ఆయాపురాణములందు వర్ణితములైయున్నవి.

బ్రహ్మాండ పురాణమునందు ఐదు అధ్యాయములచే వర్ణింపబడిన తీర్థక్షేత్ర సంగమములలో స్వయం వ్యక్తమై దిన దినాభివృద్ధినందుచు భక్తుల కొంగు బసిండిమై విలసిల్లిన దివ్య శైవ క్షేత్రము ఆంధ్రప్రదేశ మునందలి తెలంగాణా ప్రాంతము మెదక్ జిల్లాలో చిన్నగ్రామము ప్రస్తుత మండల కేంద్రమైన ఝరాసంఘం అను పుణ్యతీర్థ క్షేత్రరాజముగా, సిద్ధక్షేత్రముగా ప్రసిద్ధమైవి రాజిల్లుచున్నది.

పూర్వము కృతయుగంబున హరిశ్చంద్ర మహారాజు ఒక మహాయజ్ఞమును చేయతలంచెను. ఆ యజ్ఞము నిర్వర్తించుటకై నైమిశారణ్యమునందు తపస్సు చేసుకొనుచున్న మహామునులందరిని అయోధ్యానగరమునకు ఆహ్వానించెను.

ఆహూతులైన ఋషులందరునూ చక్రవర్తిచే సమ్మానితులై యజ్ఞ సంభారములను చూచి ఆశ్చర్య పడిరి. సంకల్పానుసారము యజ్ఞకార్యము పూర్తి అయిన తర్వాత మునులందరునూ ఒక దగ్గర కూర్చుని పరమ పౌరాణికుడైన పూర్వ గాథలను తెలిసిన సూతమహాముని చూచి ఇట్లనిరి. ఓ సూతమహామునీ!

భూమండలములోని మహామహిమాన్వితమైన యేదేనివొక పుణ్యక్షేత్ర కథను చెప్పండి.

ఇంతలో హరిశ్చంద్రమహారాజు కూడా అచ్చటకు వచ్చిచేరెను. మహారాజు కూడా పుణ్యతీర్థముల గురించి వినవలెనని తన కోరికను మహామునితో పలికెను. చక్రవర్తి మాటలను విని మహాఋషుల కోర్కెను అనుసరించి సూతమహర్షి ఇట్లు చెప్పదొడంగెను. ఓ రాజా! మూడులోకముల యందు అతి పవిత్రమూ, ప్రఖ్యాతమూ స్మరించిన మాత్రముననే సర్వసిద్ధులు ప్రాప్తించు ఒక పవిత్ర క్షేత్రమును గురించి చెప్పెదను. ఈ గాథ దత్తాత్రేయుడు పూర్వము దుర్వాస మహర్షికి చెప్పెను. శ్రద్ధగా వినండి.

భూమండలముందున్న పుణ్యక్షేత్రములో సంగమేశ్వర క్షేత్రము అత్యంత పవిత్రమైనది. ఆ క్షేత్రమును స్మరించుట చేతనే పాపములు హరించును. వెయ్యి యుగములు కాశీ క్షేత్రమున నివాసము చేసిన లభించు పుణ్యమును, కృష్ణాపుష్కరములందు స్నానమాచరించిన కలుగు సుకృతమును అంతే కాక కోటి పుష్కరస్నానములచే లభించు సత్ఫలితములను మానవులు సంగమేశ్వర క్షేత్ర సందర్శనముచే పొందగలరు. మకర సంక్రమణమునందు ప్రయాగ క్షేత్రవాసముచే లభించు పుణ్యము గ్రహణ కాలమున కోటి గోదానములు చేసిన పుణ్యములను సంగమక్షేత్రమునందు స్నానమాచరించినచో లభించును.

భూమండల మంతయూ దానము చేసినచో లభించు దాన ఫలితము, నీలాచలక్షేత్రమున వెయ్యియుగము నివాసముండుట వలన లభించు సత్ఫలితమును, హిమాలయమందున్న కేదారేశ్వరుని చరణతీర్థము తీసుకొనుట వలన మరియు గోకర్ణక్షేత్రము నందు నివసించుట వలన కలుగు పుణ్య ఫలముకన్నా అధిక ఫలితము సంగమేశ్వర క్షేత్రమును దర్శించుట వలన పొందగలము.

షోడశ మహాదానముల వలన లభించు సుకృత ఫలము, నూరు రాజసూయయాగములు, సహస్రాశ్వమేధముల వలన లభించు ఫలితము సంగమేశ్వర క్షేత్రనివాసముచే లభించును. భూమండలమున అత్యంత పవిత్రమైన గంగా సాగర సంగమమునందు క్రుంకులిడిన లభించు పుణ్యఫలమునకు రెట్టింపుగా సంగమేశ్వర క్షేత్రము దర్శించుటచే లభించును. కరువు కాటకము లందు కులభేదములేక నిరంతరము అన్నదాన శిబిరము నిర్వహించిన వారు పొందు ఫలమును సంగమేశ్వర క్షేత్రమున పిడికెడు అన్నదానముచే లభించును.

జీవితాంతము నిత్యాగ్నిహోత్రులకు లభించు యాగ ఫలము సంగమక్షేత్రమున ఏక రాత్ర నివాసముచే కలుగును. పంచమహా పాతకములచే కలుగు భయంకర ఫలితము నుండి విముక్తి పొందుటకు సంగమేశ్వర క్షేత్ర నివాసము గొప్ప ఉపాయము. బంగారము దొంగిలించిన వారు, మధ్యపానము చేసిన వారు, గురువు పడకపై నిద్రపోయిన వారు, మిత్ర ద్రోహము, వేదమును నిందించిన వారు మొదలగు పాపకర్మలను ఆచరించిన వారందరునూ సంగమ క్షేత్ర నివాసముచే పాపముల నుండి విముక్తులగుదురు.

భయంకరమైన కుష్ఠు, అపస్మారము మొదలగు భయంకర వ్యాధి పీడితులు కూడా సంగమేశ్వర క్షేత్రమునందున్న అమృత కుండమునందలి జలముతో స్నానమాచరించి సంగమేశ్వర స్వామిని దర్శించినచో పాపములకు ప్రతి రూపములగు వ్యాధుల నుండి విముక్తి పొంది సంపూర్ణ ఆరోగ్యమును పొందగలరు. నిష్ఠా గరిష్ఠులై శుచిస్మితులై ఈ క్షేత్రమునందలి అమృత కుండమున స్నానమాచరించి విధి విధానముగా గాయత్రీ మహామంత్రమును ఉపాసించినచో మంత్రసిద్ధిని పొందగలరు. సంకల్ప సిద్ధులయిన అట్టి వారి కోరికలు తక్షణము ఫలించును. గొడ్రాలైననూ సంతాన వాంఛచే ఈ క్షేత్రమును ధ్యానమాచరించినచో రూపగుణ సంపన్నులగు సత్సంతానమును పడయగలరు. సంగమేశ్వర సన్నిధిలో ధ్యానోపాసనములు చేసినచో తప్పక మోక్షము లభించును. దీని ప్రసిద్ధిని ఎంత చెప్పిననూ తక్కువే మహామహిమాన్వితమై ఇష్టకామ్యముల నీడేర్చు ఈ క్షేత్ర మహాత్మ్యము బ్రహ్మాండ పురాణము నందు చక్కగా వర్ణింపబడినది.

# ౭వ అధ్యాయము

సవిస్తరముగా సంగమేశ్వర క్షేత్రమహాత్త్యమును వినిన వాడై హరిశ్చంద్ర మహారాజు, ఓ సూత మహామునీ మీ దయ వలన క్షేత్ర మహాత్త్మమును విని ధన్యులమైనాము. ఈ క్షేత్రము నందు వెలసిన శంకరుడు సంగమేశ్వర నాయకుడై యెవరినైనా అనుగ్రహించి నాడా, అయినచో ఆ కథను వివరించండి అని శ్రద్ధా సక్తులతో ప్రశ్నించెను. అంతే గాక సంగమేశ్వర క్షేత్రమునందున్న పుష్కరిణికి అమృతకుండ మనే పేరెలా వచ్చింది. ఎవరా పేరును బెట్టినారో మినవలయునని కుతూహలముగా వున్నది. వివరముగా తెలియజేయుడని హరిశ్చంద్రుడు సూత పౌరాణికునితో అనెను.

మహారాజు మాటలు వినిన సూతుడిట్లు చెప్పుట ప్రారంభించెను. సత్యవాది, జితేంద్రియుడు సూర్యవంశము నందు జన్మించిన మహాకీర్తి వంతుడైన కుపేంద్రుడను పేరు గల వొక చక్రవర్తి కృతయుగమునందు భారత దేశమును పరిపాలించుచుండెను.

సర్వసద్గుణ సంపన్నుడు, కార్యదీక్ష కలవాడు, మహాశూరుడు, శత్రుంజయుడు, సమస్త విద్యలయేందు ఆరితేరిన వాడు సర్వశాస్త్రములను అధ్యయనము చేసినాడు, అపరిమిత దయాగుణమును కలిగిన వాడు, పరోపకార పరాయణుడైన కుపేంద్రుడు ప్రజలను కన్న బిడ్డలవలె కరుణతో కాపాడుచుండెను.

శౌర్య పరాక్రమములయందును, గుణ రూపముల యందు నియమ నిష్ఠల యందును కుపేంద్రునకు సాటి రాగల రాజులు ఆనాటి రాజలోకములోనే లేకుండిరి.

ఆ మహారాజుకు సద్గుణఖని శీలవతియునై సౌందర్యమున చంద్రుని బోలిక కాంతి కలిగిన చంద్రకళ యనెడు సార్థక నామము గలిగిన ధర్మపత్ని కలదు. అమెతో కలిసి మహేంద్రునితో సమానమైన పుత్రులను కనెను.

మహాగుణ వినీతుడైన కుపేంద్ర మహారాజునకు పూర్వజన్మ శేష భూతమైన కర్మచే దేహమునకు భయంకరమైన వ్యాధి సంక్రమించెను. శరీరమునకు పుండ్లు పడి ఆవ్రణముల నుండి చీము, నెత్తురులు కారి వేల సంఖ్యలో క్రిములతో పరమదుః ఖితుడై తేజో విహీనుడై వ్యాధి నివృత్తి మార్గము దెలియక చింతించుచుండెను.

ఎన్నియు పచారములు జేసినను అవియన్నియు నిష్ఫలములగుటచే తీర్థయాత్రలు చేయ సంకల్పించెను. వ్యాధిచే దివారాత్రములు బాధననుభవించుచు కుపేంద్ర మహారాజు వేదోక్త ధర్మాచరణము నందు ఆశ్రద్ధ వహింపక విధ్యుక్త కర్మాచరణ శీలియై యుండెను. క్రిములచే శరీరము పీడింపబడుచున్నను. క్రూరమృగములను వేటాడుటకై అరణ్య ప్రాంతములందు సంచరించుచు వాటిని సంహరించి ప్రజలను నిర్భీతులను జేయుచుండెను.

ఒకనాడు క్రూరమృగములను వేటాడుచున్న కుపేంద్ర భూపతి అశ్వారూఢుడై మహారణ్య మధ్యములో సైన్యములకు బహుదూరగతుడై ఏకాకి అయ్యెను.

ప్రారబ్ధకర్మ విశేషము చేతను, ఈశ్వరానుగ్రహము చేతను సంగమేశ్వర నివాసస్థానమైన కేతకీ (మొగలిపూల) వనమునకు జేరెను. ప్రయాణ బడలిక చేతను దేహమందలి వ్యాధి చేతను బాధపడుచున్న కుపేంద్రుడు దాహ బాధా పీడితుడై నీటి కొరకు అటు ఇటు తిరుగు చుండెను. అట్లు జలాన్వేషణ చేయునతనికి పొంగిపొరలు చున్న జలాశయము కన్పించెను. వెంటనే గుఱ్ఱము దిగి స్వచ్ఛమై అమృతోపమానమై భాగీరథీ జలములను బోలు ఆ జలాశయములో కాళ్ళు చేతులు శుభ్రముగా కడుగుకొని తృప్తిగా ఆ నీటిని సేవించెను. అచ్చటనే కొంత సేపు విశ్రాంతిని తీసికొనెను. తిరిగి సేవతో గలసి తన పట్టణమునకు వెళ్ళెను. రాత్రి ధర్మపత్నితో గలసి భోజనాధికము పూర్తి గావించి సుఖముగా నిద్రించెను.

ప్రాతః కాలమున సుఖముగా నిద్రలేచిన కుపేంద్ర మహారాజును జూచిన అతని భార్య చంద్రకళ సంభ్రమాశ్చర్యములతో రాజా! ఈ రోజు మీ శరీరమునవ్య కాంతులతో తేజో విరాజితమైయున్నది. మీ శరీరమునందున్న వ్రణములు పూర్తిగా మానిపోయిన విసుమా! ఔషధసేవనమ చేతనా, మహాఋషుల ఆశీర్వద ఫలితమా లేక యేదైన మహిమాన్వితములైన నదీ జలమును సేవించితిరా యని ఆతురతతో ప్రశ్నించెను. తన శరీరమును జూచు కొని అత్యంతాశ్చర్యముతో తేరుకొనిన కుపేంద్రుడు భార్యతో యిట్లనెను.

చంద్రకళా! ఔషధముల వలన విసిగి పోయిన నేను ఈ మధ్యకాలమున వాటిని పూర్తిగా మాని వేసితిని. మాహర్షుల సేవా భాగ్యము కూడా యీమధ్యకలుగలేదు. అనేక పుణ్యక్షేత్రములు దర్శించు అనేకమైన నదీ తీర్థములను సేవించి విసిగిపోయిన నాకు శరీరమునందలి వ్యాధినయమగుట ఆశ్చర్యముగా నున్నది సుమా అనెను.

ఆ మాటలు విన్న చంద్రకళాదేవి నాథా! గత రెండు మూడు రోజులలో మీరెదైన పుణ్యక్షేత్రమును దర్శించినారా ఏదైనా నదీ జలమున స్నానమాడి ఆపవిత్ర జలమును సేవించితిరా అని ప్రశ్నించెను.

భార్య మాటలను విని కుపేంద్ర భూపతి ఆలోచించి ఆ జ్ఞాపకము వచ్చినది దేవీ నేను నిన్నటి దినమున సైన్య సమేతుడనై వేటుకు వెళ్ళితిని గదా! అట్లు భయంకరమైన అడవిలో అశ్వారూఢుడనై వంటరిగా సంచరించు వొక విచిత్ర మృగమును వెంబడించి చాలా సేపు పరుగెత్తి మధ్యాహ్నమునకు వొక కేతకీన నమున కుంజేరితిని. ఆ వనములోనే ఆ విచిత్ర మృగము అదృశ్యమయినది. ఆలసిపోయిన నేను దాహ పీడితుడనై నీటి కొరకు వెతికితిని. సమీపము నందే వొక జలాశయము కన్పించగా అందులో కాళ్ళు, చేతులు, ముఖము కడుగుకొని అమృతో పమానమైన ఆ జలము సేవించితిని. అందులో ప్రకాశించు నొక బాణలింగమును జూచితిని. రోగోపశమనమును ఆకాసార జలము గాని లేదా అందరి లింగాకరము గల పరమేశ్వరాను గ్రహము గాని కావచ్చును అనెను.

ఈ విషయమును వినిన చంద్రకళాదేవి, ప్రభూ మీరు చెప్పిన మాటల వలన అ దివ్యక్షేత్రము, కాసారము నందలి ఆ పవిత్ర జలము మహామహిమాన్వితములని నాకు దోచుచున్నది. అందువలన దీర్ఘకాలము నుండి మిమ్ముపీడించున్న వ్యాధివుపశమించినది. కావున సకుటుంబముగా ఆ క్షేత్రమును దర్శించి, ఆ దివ్య కాసారమున క్రుంకులిడి అచ్చటి బ్రాహ్మణులను సేవించి, ప్రజలకు దానములొచరించినచో మన కుటుంబమునకు సంపూర్ణమైన ఆయురారోగ్య సుఖ సౌఖ్యములు కలుగును గదా అని పలికెను.

భార్య మాటలను వినిన మహారాజు మరుసటి దినముననే సకుటుంబ సపరివారముగా బయలుదేరి బిను జూచిన ఆ కేతకీ వనమునకు జేరెను. సకుటుంబ సమేతముగా ఆ జలాశయమున స్నానమాచరించి అచ్చటి పేదలకు బ్రాహ్మణులకు అపరిమిత దానములు జేసెను. కాసార మధ్యమున దివ్య ప్రభాభాసురమైన బాణలింగమును భక్తి శ్రద్ధలతో అర్చించి నమస్కరించెను. దేవర్షియగు నారదమ నీంద్రుడు వైకుంఠము నుండి మిథలా నగరమునకు వెళ్ళుచు మధ్యాహ్న స్నాన సంధ్యాను ష్టానములను పూర్తిగా వించుకొనుటకై అమృత కుండము జేరెను. అచటనే వున్న కుపేంద్ర భూపతి నారద మహామునిని జూచి యధోచిత సత్కారముల జేసి నమస్కరించెను.

త్రికాలవేదియైన నారద మహామునితో కుపేంద్రుడు ఓ మహాబునీ ఈ కాసారము నందు ప్రకాశించు బాణలింగమును మరియు ఈ కాసార జల విశేషములను వివరించవలసినదిగా తమరిని ప్రార్థించుచున్నాను అని పలికెను.

## 3వ అధ్యాయము

కుపేంద్ర భూపతి మాటలను విని నారద మహర్షి అమృత కుండ మహాత్మ్యమును, బాణలింగమును గూర్చిన లీలలను ఇట్లు చెప్పమెలిడెను.

సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు ఆత్మపరమాత్మ జ్ఞాన సముపార్జనకై సాధనకనువైన స్థలములను వెదకనెంచి హంసవాహనారూఢుడై ఆకాశమున సంచరించుచున్నప్పుడు అత్యంత విశాలమైన ఆహ్లాదకరమైన ఈ కేతకీ వనము విధాత దృష్టిన ఆకర్షించినది. మనోహరమైన ఈ వనమును జూచి విమానమునుదిగి వనమందు తిరుగుచు ఆ స్థల మహాత్మ్యమును గమనించి సంభ్రమాశ్చర్యచకితుడై వనమందు కూర్చొని తపమాచరించుట ప్రారంభించెను.

విధాత తపస్సునకు మెచ్చి భక్తవ శంకరుడైన శంకరుడు ప్రత్యక్షమగుటచే ఈ క్షేత్రము సంగమ క్షేత్రమైనది. శివునితో పాటే అతని అర్చావతారమైన స్వయంభువైన బాణలింగము ఆవిర్భవించెను. ఈ లింగము పూజించినంత మాత్రముననే తక్షణమే సమస్త కోరికలు సిద్ధించును. స్వయంభువైన బాణలింగమును తనక మండల జలముచే మొదట బహ్మ అభిషేకించి అర్చించెను. తరువాత ఆలింగమును కోలనులోనె ప్రతిష్ఠించి వుంచెను. శివబ్రహ్మల సంగమస్థానమగుటచే ఈ క్షేత్రమునకు సంగమక్షేత్రమని ఇచ్చట వెలిసినన శివునకు సంగమేశ్వరుడని పేరు వచ్చినది. అని నారదుడు క్షేత్రవిశేషమును వివరించును.

మహాదేవుని దర్శించిన సృష్టికర్త, ఓ దేవా దేవా పార్వతీ మనోహరా! నీలకంఠా! మహేశ్వరా! శివా! జగత్కల్యాణకారకా! త్రిగుణాతీతా! ఫాలలోచనా చంద్రశేఖరా! త్రిమూర్తిస్వరూపా భక్తవత్సలా! హే విరూపాక్షా! గంగాధరా! శంకరా! నీలలోహితా! ఇవే నా నమస్సులు.

హే గిరిజానాథా! వృషభవాహనా! త్రిపురాంతకా! సర్వజ్ఞా! సదానంద స్వరూపా! సంగమేశ్వరా సచ్చిదానంద స్వరూపా! నిర్వికల్పా! హే భూతనాథా! నీకివే నా నమోవాకములు.

మోహాంధకారమగ్నులైన వారికి నీవు సూర్యుని వంటి వానివి. భక్తులకు ముక్తి దాయకుడవు. క్షేత్రజ్ఞుడవు వేదాంత వేద్యుడైన నీకివే నా మనస్సుమాంజులులు. దేవదానవులచే పూజింపబడుచు, శుద్ధ విజ్ఞాన స్వరూపవడవై, పరిపూర్ణుడైన గిరీశా!నాయంజలి గ్రహించి అనుగ్రహింపుము.

హే పరాత్పరా! సనాతనా! హే శివా! భవా! శర్వా మహాయోగీ నమస్సులు హేమహేశా నీ అనుగ్రహముచే ధన్యుడను. నీవు తప్ప నాకు గత్యంతరము లేదు. హే కరుణా కరా! దయాసింధూ! భూతనాథా! ప్రసన్నుడవు కమ్ము అని తనివి తీర ప్రార్థించెను.

బ్రహ్మచేత కీర్తింపబడిన త్రినేత్రుడు సాదరముతో సృష్టికర్తను సమీపించి, ఒక మలాసనా! విరించీ! నీ స్తోత్రములచే సంతృప్తి చెందినాను. నీ కాంక్షితముల నీడేర్చెదను. నీకు శుభమగు గాక, వరములను కోరుకొనుమని ఆశీర్వదించెను. అప్పుడు బ్రహ్మ ఆనందించి ఓ మహాదేవా! సదా నా హృదయము నీ పాద పద్మముల యందే లగ్నమై వుండునటుల అనుగ్రహింపుము. ఇది నా మొదటి వరము. ఈ రూపముతో శాశ్వతముగా యిచటనే యుండి భక్తుల సమస్తమైన కోరికలను దీర్చుచు భక్తవశంకరుడవై కీర్తిగాంచుట నా రెండవ వరము.

ఆచంద్రతారార్కము, వేదములీ భువినున్నంత కాలము సంగమేశ్వర నామముతో ఆర్తులకు అభయం కరండవై వుండునట్లు అనుగ్రహింపుము. ఓ దేవ దేవా సర్వకాల సర్వావ స్థలయందు భక్తుల కోరికలను తీర్చ వలసినదిగా ప్రార్థించుచున్నాను. అంతే కాదు అల్పయుష్కులగు దేహధారులకు ఉత్తమ సిద్ధ క్షేత్రముగా ఈ స్థలమును అనుగ్రహించుము. భాగీరథీ పవిత్ర తీర్థమునకు సాటిగా వుండునట్లు ఈ కాసార జలమును అనుగ్రహింపుము మహాదేవా! ఈ పవిత్ర క్షేత్రమునందు యెవరు భక్తి శ్రద్ధలతో ధ్యానము చేయుదురో అట్టివారి కోరికలు వెంటనే తీరునట్లు వరమొసంగుము.

ఓ కరుణానిధీ! త్రిలోచనా! ఆర్తులకు భక్తులకు ఉపయుక్తమైన నాయీ కోరికలనుమన్నించి అనుగ్రహించప వలసినది ప్రార్థించుచున్నాని బ్రహ్మమహేశ్వరుని ప్రార్థించెను. ఓ జగన్నాయకా నీవే ఈ జగంబునకు తల్లివి తండ్రియునైయున్నావు. నీ దయ చేతనే సృష్టి స్థితీలయములు నేరవేర్పబడుచున్నవి.

హే దక్ష యజ్ఞ విధ్వంసకా! సంగమేశ్వరుడైన నిన్ను యెవరు సేవింతురో, యెవరు పూజింతురో వారందరును అణిమాది అష్టసిద్ధులను పొంది సుఖ సంతోషాలను అనుభవింతురు గాక. అంధులకు నేత్ర దృష్టియు, మూగ వారికి వక్తృత్వమును, రోగపీడితులు రోగముక్తులు గాను, నిర్యోగులను యోగులు గాను చేయు ఘటనా ఘటన సమర్థుడవైన ఓ దేవ దేవా! సంగమ నాథా! ప్రణామములు. ఎవరిని సేవించిన జన్మ జన్మాంతర పాపములు నశించునో యెవరి అనుగ్రహముచే సర్వసంకల్పములు క్షణములో ఈ దేరునో అట్టి కరుణాంతరంగుడవగు ఓ సంగమేశ్వరా నిన్నే ఆశ్రయించి ఆర్చింతును.

బహుకృత జన్మపాపములను హరించు అమృతోపమానమైన అమృత కుండమను పేరుగల ఈ తీర్థరాజమునకు నమోవాకములు. అక్షయ సంపత్కరమును, ఆనంద దాయకమైన ఈ కాసారమునకు ప్రదక్షిణ నమస్కారములు. ఇట్లు ప్రార్థించిన, బ్రహ్మ దేవునకు పినాకపాణియైన పరమేశ్వరుడు యథావాక్యముగా అనుగ్రహించెను.

ఓ విధాతా! వినుము ఈ కేతకీ వనమున నివసించిన వారలకు కాశీ క్షేత్ర నివాస ఫలితమును ప్రసాదించు చున్నాను. ఈ అమృత కుండమున స్నాన మాచరించిన వారు గొప్ప జ్ఞాన సంపద గలవారగుదు. ఇచ్చట నివసించు వారలకు అనంత పుణ్య ఫలమును మరియు మోక్ష ధానమును అనుగ్రహించుచున్నాను. కోటి గోదానములు చేసిన పుణ్యమును కోటి గాయత్రీ జపమును చేసిన యెంతటి పుణ్యమో అంతటి పుణ్యఫలమును సంగమేశ్వర దర్శన పూజనాది కములచే లభించునట్లు అనుగ్రహించు చున్నాను.

శతాధిక గంగా స్నానములు కోట శివార్చనములను కోటి విష్ణు గాయత్రీ జపము చేసిన లభించు ఫలితము లభించగలవు. బ్రహ్మకమండల జలముచే సంగమమైన ఈ తీర్థరాజము ఉత్తమోత్తమమైన జలార్ణవమైన ఈ అమృత కుండము అపార గుణ విశేషములు గలదై అభయంకరమై ఉండనటుల నిత్యము సత్యము అగునట్లు అనుగ్రహించుచున్నాను. ఈ అమృత కాసారమున స్నానమాచరించినచో గోమతీ తీర్థమునందలి కృష్ణ సన్నిధిలో దానముచేసిన ఫలము కలుగును. ఇట్లు వరములను గ్రహించి పరమేశ్వరుడు అంతర్ధానము కాగా సిద్ధసంకల్పుడైన విధాత సత్యలోకమునకు వెళ్ళి సృష్టి కార్యమందు నిమగ్నుడయ్యెను.

## 4వ అధ్యాయము

ఓ కుపేంద్రమహారాజా! తపశ్చర్యవలన బ్రహ్మకు ఈశ్వరుడు ఈ క్షేత్రమున ప్రత్యక్షమగుటచే ఈశ్వర బ్రహ్మల సమాగమము సంభాషణములు జరుగుట చేయీ క్షేత్రము సంగమ క్షేత్రమనియు, ఈ కాసారమునకు అపూర్వ శక్తులతో బాటు ఈశ్వరానుగ్రము వలన యిందలి జలము అమృతోపమానమగుటచే అమృత కుండని పేరు వచ్చెను.

ఈ కొలను యందు స్నానమాచరించిన బధిరాంధత్వాది బాధలే గాక కుష్టు అపస్మారము మొదలగు భయంకరయీతి బాధలును నశించి సుఖ సంతోములు కలుగును. అసాధ్యమైన కోరికలు గూడా యీకుండ స్నానము వలన సిద్ధించగలవు. సంతాన హీనులైన వారికి సుపుత్ర ప్రాప్తికలుగును. ఈ క్షేత్ర సందర్శనచే భుక్తి, ముక్తి సంపదలు కలుగుననుటలో సందేహములేదు. ఇట్టి మహా మహిమాన్వితమైన పవిత్ర తీర్థము భూలోకములో మరొకటి లేదు.

నారదుని మాటలను శ్రద్ధగా నాలకించిన కుపేంద్ర భూపతి ఆచటనే తన నివాసమును యేర్పరు కొనవలెనని సంకల్పించెను. అనుకొన్నట్లుగానే ఆ ప్రాంతము అనేక ఫలపుష్ప విరాజితమైన వృద్యాన వనములతో అత్యంత సుందరమైన కుపేంద్ర నగరమను పట్టణము నిర్మించెను. సువర్ణ ప్రాకారముతోను మణిగణ ఖచితమైన దివ్య ప్రాసాదములతోను మలయ మారుత సమీరితములై గృహములను నిర్మింపజేసెను. నేటికిని కుప్పానగరము అను పేరుతో వొక గ్రామము క్షేత్రమునకు కిలో మీటరు దూరమున మనకు చూడవచ్చును.

చతురంగ బలములతో నిరంతర వేదఘోషలతో సరర్తుకు సుమోద్యానములతో, మధురసఫల పాదపములతో వైభవూపేతమై సుశోభితమై కుపేంద్రనగరము అమరావతితో సమానముగా భాసించుచుండెను. స్వధర్మ నిరతులైన ప్రజలచే ఆశ్రమ ధర్మానుష్ఠాన పరులచే ధనాధిపతిని బోలిన ధనికులతో సుసీర్ణమై కుపేంద్ర నగరము శోభిల్లుచుండెను.

కుపేంద్ర నగరమునకు ఉత్తర దిశగా విప్పలీ వృక్షమూలోత్పన్నమైన వొక ప్రవాహమున్నది దీనిని బహ్మనది యందురు. ఈ క్షేత్రమునందు స్వకర్మనిరతుడై ప్రతిదినము ప్రాతః కాలముననే అమృత కుండమున స్నానాదికములను పూర్తి చేసికొని కేతకీ వనమందలి కేతకీ పుష్పములను గ్రహించి అచటి బాణలింగమును భక్తి శ్రద్ధలతో పూజించుచు కుపేంద్ర భూపతి రాజ్య పాలన గావించుచుండెను. ఈ విధముగా కొంత కాలము జనరంజకముగా రాజ్యపాలన గావించిన కుపేంద్ర భూపతి. రాజ్య భారమును కుమారుల కప్పగించి యోగముచే పార్థివ శరీరమును విడిచి దివ్య విమానము నధిరోహించెను. నీ పూర్వ జన్మ పుణ్య విశేషము వలన మహా మహిమాన్వితమైన తీర్థ క్షేత్రరాజమైన సంగమేశ్వర మహత్మ్యమును వింటివిగదా ఇంకను యేమైన వినగోరుచున్నానామని ప్రశ్నించెను.

సూతుని మాటను వినిన హరిశ్చంద్రుడు ఓ మహామునీ! పరమేశ్వరునకు కేతకీ వన నివాసము గాని కేతకీ పుష్పార్చనము నిషిద్ధమని పెద్దల చేవిని యున్నాను. కేతకీ పుష్పములచే యెవరు శివుని పూజింతురో అట్టివారు ఇంద్రుని వజ్రాయుధముచే సంహరింపబడెదరని ఆర్యుల వలన వినియున్నాను. అక్షింతలచే విష్ణువును. కేతకీ సుమములచే శివుని దర్భకు సుమములచే దుర్గను, తులసీ దళములచే విఘ్నేశ్వరుని పూజించుట శాస్త్ర నిషిద్ధముగదా! శాస్త్ర విరుద్ధమై ఈ విషయము నాకు బోధపడుట లేదు. దీనికి సంబంధించి యేదైన యితహాసమున్నదా! అని హరిశ్చంద్రుడు సూతపౌరాణికుని ప్రశ్నించెను.

ఈ ప్రశ్న వినిన సూత పౌరాణికుడు, ఓ హరిశ్చంద్ర మహారాజా అతి పురాతనమైన పాప వినాశ కారకమైన వొక కథ చెప్పెదను. సనాతన కాలమున కేతకి అను వొకస్త్రీ పరము శివునకు వ్యతిరేకముగా అసత్యమైన సాక్ష్యము చెప్పుటచే పరమేశ్వరుడామెపై ఆగ్రహించి ఆమెను శపించెను. అప్పుడామె పరమేశ్వరుని పాదములపై బడి ప్రార్థించి శాప విమోచనము కోరెను. కరుణాంతరంగుడైన భోళాశంకరుడు ఆమెను లేవనెత్తి శుభప్రదమైన వర మొసంగెను. ఓ కేతకీ భూలోకమున నీవు కేతకీలను పూదోటగా జన్మింతువు. ఆవన మందేనేను నివాస మేర్పరచుకొని నీచేత నిత్య పూజలందుకొని నీ పాపములను ప్రక్షాళనము జేయుదును.

నీవు వన రూపధారిలైయున్న ప్రదేశమున యెవరు వొక వ్యక్తికి అన్నధానము చేయుదురో అట్టి వారికి లక్ష అన్నధానములు జేసిన పుణ్యము లభించునట్లు వరమొసంగుచున్నాను. ఈ విధముగా వరమొసంగిన భూత నాథుడు ఆనాటి నుండి ఆచటనే నివాస మేర్పర్చుకొనెను. అప్పటి నుండి కేతకీ పుష్పములచే సంగమేశ్వరుడను పేరుతో అచ్చట మాత్రమే ఇట్లు పూజలందుకొనుచున్నాడు. ఎవరైతే ఈ క్షేత్రమునందు కేతకీ పుష్పములతో సంగమేశ్వరుని పూజింతురో అట్టి వారికి వొక మహాయజ్ఞము చేసిన

సుకృతము లభించును. ఈ క్షేత్రమున జేయు కించిదానమైనను యజ్ఞాధిక ఫలితము నీయగలదు. సంగమేశ్వర క్షేత్రమునందలి అమృత కుండములో స్నానము చేసి దానము చేసినచో అట్టి వారియింటిలో కామధేనువు నిత్య నివాసము చేయుచు సకల సంపదల నొసంగును. ఇంతటి మహిమన్వితమైన పుణ్యప్రదమైన పురాణ కథను వినుట వలన నీవును, చెప్పుట వలన నేనును ధన్యులమైతిమి. అని సూతుడు ఈ విధముగా కేతకీ శాప విమోచనమును సవిస్తరముగా తెలిపెను.

## 5వ అధ్యాయము

ఓ హరిశ్చంద్ర రాజేంద్రా అమృత కుండమని పేరు గల ఈ కాసారము యొక్క పవిత్రత మహాత్మ్యములను వినుము. ఇందులో పాపవినాశన కరములైన అనేక పవిత్ర తీర్థ జలములు సమ్మిశ్రితములైయున్నవి. ఈ కుండమున తూర్పుదిశను ఇంద్ర తీర్థమని అంటారు. ఈ కొలను యందు తూర్పు దిశగా స్నానమాచరించి సంగమేశ్వరుని పూజించి దాన ధర్మములు చేసినచో జనాంతమునందు మహేంద్ర సదృశులు కాగలరు. ఈ దిశయందు శచీసమేతుడైన ఇంద్రుడు నిత్య నివసిరై కుంకులిడిన జనులను సంసార సాగరము నుండి విముక్తులను జేసి పాపములను ప్రక్షాళన జేసి స్వర్గమున శాశ్వత నివాసులను జేయును.

అమృత కుండమునకు ఆగ్నేయ దిశగా కశ్యప ప్రజాపతివొక బదరీవృక్షమును నాటెను. ఈ దిశ యందు బదరీ నారాయణుడు నిత్య నివాసమై యుండును. ఈ దిశలోని తీర్థమునకు నారాయణ తీర్థమని పేరు. ఈ దిశ యందు స్నాన మాచరించిన వారలకు శ్రీ మహాలక్ష్మి ప్రసన్నురాలై శాశ్వత సకల సంపదలను కలుగునట్లు ఆశీర్వదించును నారాయణ తీర్థ మందు స్నానమాచరించినచో పితృ దేవతలు తృప్తిపొంది వైకుంఠమున కేగగలరు.

అమృత కుండమునకు దక్షిణ దిశయందున్న జలమునకు ధర్మతీర్థమని పేరు. ధర్మరాజు చేత ప్రతిష్టింపబడిన ధర్మదేవత ఈ స్థానమున స్నానమాచరించిన వారిని ధర్మనిష్ఠాపరులగునట్లు చేయును. అంతేగాక సర్వధర్మానుష్ఠాన ఫలము లభించును.

పూర్వజన్మలయందలి పాపములు గూడా నశించును. దక్షిణ దిశయందే దత్తాత్రేయునిచే ప్రతిష్ఠిపబడిన దత్త తీర్థము కలదు. ఇచటి జలమునందు మునిగిన పరమహంసలగు యోగీశ్వరులకు లభించు పుణ్యము లభించును. పశ్చిమమున వరుణ కల్పిత జలధారకలదు. ఇందు స్నానమాచరించినచో గోదాన పుణ్యము లభించగలదు. వాయువ్యమున సప్తఋషులచే స్థాపించబడిన ఋషితీర్థము కలదు.

ఇది అత్యంత పుణ్యప్రదమైన జలధార కలదు. ఇందలి జలముతో కృంకులిడిన వారికి సప్త బ్రాహ్మణ సంతర్పణ జేసి నంత పుణ్యము లభించును. అట్టి వారికి మరణానంతరము పునర్జన్మ రహితమైన పరమ పవిత్రమైన ఋషిలోకము నందు శాశ్వత స్థానము లభించును. అమృత కుండమునకు ఉత్తరదిశలో చంద్ర స్థాపితమైన సోమ తర్థము విరాజిల్లు చున్నది. ఇచట స్నాన మాచరించిన సోమేశ్వర పూజనము వలన లభించు సుకృతమును పొందెదరు. ఈ శాన్యమున రుద్ర తీర్థమను జలధారవున్నది. ఇచట స్నానమాచరించినచో శాశ్వత శివసాన్నిధ్యము లభించును.

పరమ పవిత్రమైన ఈ యష్ట తీర్థస్నానము సర్వపాపహారము సుఖకరము సంపత్ప్రదము కాగలదు. దేహాంతమున వారికి శివసాన్నిధ్యము లభించును. అమృత కుండమున స్నానమాచరించి సంగమేశ్వరుని పూజించినచో వారికి పునర్జన్మలేదు.

ఓ రాజేంద్రా! సంగమక్షేత్రము యొక్క మహాత్మ్యము మరియు అమృత కాసార పవిత్రతా మహాత్మ్యములను వివరించినను. ఈ సంగమక్షేత్ర మహాత్మ్యమును యెవరు పఠింతురో, ఎవరు పారాయణము చేయుదురో అట్టివారికి అష్టైశ్వర్యములు లభించి, జన్మాంతరమున పునర్జన్మ రహితులై పరలోక సౌఖ్యములను భవించగలరు. ఇంత మహిమాన్విత మైన చరిత్రను వినిన నీ జీవితము ధన్యమైనది. అని సూత పౌరాణికుడు వివరముగా సంగమ క్షేత్ర మహాత్మ్యను ముగించెను.

శ్రాణ మాసమందు ఈ సంగమేశ్వర క్షేత్ర మహాత్మ్యము శ్రవణ ఫఠనముల వలన సమస్తమైన కోరికలు సిద్ధించగలరు. కేతకీ వనమును మించిన మహిమాన్విత మైన స్థలముగాని, అష్టతీర్థములకన్న పుణ్య ప్రదములైన తీర్థములు గాని, సంగమేశ్వరుని మించిన దయకల దైవముగాని లేరనుట నిత్య సత్యము. ఒకసారి పఠించిననే సర్వసౌఖ్యముల నను భవించేరు. ప్రతి నిత్యము పఠించువారికి శక్తి, భక్తి, ముక్తి, భుక్తి లభించి సుఖ శాంతులై జీవితము నందు సంతోషమును అనుభవించగలరని బ్రహ్మాండ పురామునందు చెప్పబడి పరమ పవిత్ర సంగమ క్షేత్రమహాత్మ్యము శుభప్రదమైనది.